క్లుప్తంగా

వైభవంగా తిరుపతి గంగమ్మ జాతర

పెద్దపంజాణి: మండలంలోని చీకలదిన్నెపల్లెలో ఆదివారం తిరుపతి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి శిరస్సు ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మను కొలువుదీర్చారు. వేకువజామునే అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శిరస్సు మెరవణి అనంతరం అమ్మ వారి విశ్వరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు.

గంగమ్మ సేవలో ప్రముఖులు


సతీష్‌కు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకుడు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మతల్లిని ఆదివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో అమెరికా తెలుగు అసోసియేషన్ (తానా) మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి విశిష్టతను అర్చకులు వివరించారు. ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

కుప్పం: పట్టణంలోని మోడల్‌కాలనీలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 21వ తేదీన గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పండుగ నాడు ఉదయం పంచామృత అభిషేకం, సత్యనారాయణ వ్రతం, మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం పల్లకి సేవ, ప్రాకారోత్సవం, రాత్రి హారతి, పవళింపు సేవ జరిపించనున్నట్లు వివరించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై సాయినాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. క్యాంపులో 100 మంది పైగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 25 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. శిబిరానికి హాజరైన రోగులకు ప్రయాణ ఖర్చులతో పాటు భోజనం, వసతి, మందులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ వైద్యులు మురళి, కృష్ణ, శ్రీనివాసులు, చంద్ర, చిన్నబ్బ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


ప్రబోధానంద రచనలపై ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

కుప్పంరూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం పొందవచ్చని ప్రబోధానంద సేవాసమితి కుప్పం ప్రతినిధి కృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని సామగుట్టపల్లెలో ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ భగవద్గీత పఠనంతో శాంతి, సౌభాగ్యం సిద్ధిస్తుందన్నారు. కుల, మతాలకు అతీతంగా గీతను చదువుకోవచ్చని సూచించారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా ప్రబోధానంద రచనలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రకాష్, నాగరాజు, సుధాకర్, చందు, శశాంక్, దేవరాజు, పూజ, వెంకటలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

వరసిద్ధుని సన్నిధిలో డీజీపీ


డీజీపీకి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని డీజీపీ ద్వారక తిరుమలరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అనంతపురం రేంజ్ డీఐజీ షీముషి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఏఎస్పీలు, డీఎస్పీలు, ఆలయ అధికారులు, వేద పండితులు ఘనస్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. మూలస్థానంలోని స్వామి వారి విశిష్టతను, చరిత్రను అర్చకులు ఆయనకు వివరించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీ మహబూబ్‌బాషా, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్, సీఐ రవిశంకర్, ఎస్‌ఐ రామ్మోహన్, ఏఈఓ క్రిష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి ఉన్నారు.

సిరులు కురిపిస్తున్న స్వీట్ కార్న్




స్వీట్‌కార్న్‌ను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

స్వీట్ కార్న్ సాగు చేసిన రైతులు ఆదాయ మార్గంలో పయనిస్తున్నారు. మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే నాణ్యతకు అనుగుణంగా రేటు నిర్ణయించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. స్వల్పకాలిక పంట కావడంతో తక్కువ సమయంలోనే అన్నదాతలు లాభాలను అందుకుంటున్నారు.

- మార్కెట్‌లో నిలకడగా ధరలు
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న వ్యాపారులు
- ఆనందంలో అన్నదాతలు

శాంతిపురం: స్వల్పకాలిక ఆహార పంట స్వీట్ కార్న్ ధరలు రైతులకు ఊరటనిస్తున్నాయి. మూడు నెలల్లో పూర్తయ్యే ఈ పంటకు ఈ ఏడాది జనవరి నుంచి మార్కెట్ స్థిరంగా కొనసాగుతోంది. వ్యాపారులు స్థానికంగా రైతుల వద్ద నుంచి మార్కెట్ డిమాండ్ మేరకు కిలో రూ.20 నుంచి రూ.35 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పంట నాణ్యతను బట్టి కిలో మొక్కజొన్న పొత్తులు రూ.22–రూ.24 మధ్యలో ధర పలుకుతున్నాయి. చెన్నై మార్కెట్‌లో అయితే రూ.26– రూ.30 ధరలు ఉన్నాయి. అన్నదాతలను వెతుక్కుంటూ వ్యాపారులే వచ్చి పొలంలోనే పంటను కొనుగోలు చేస్తుండడం విశేషం. ఎకరాకు రూ 45,000 వరకు పెట్టుబడి అవసరమయ్యే స్వీట్ కార్న్ 90 రోజుల్లోన పంట చేతికొస్తుంది.

చీడపీడలను అధిగమిస్తే..

స్వీట్‌కార్న్‌కు సాధారణంగా చీడపీడలు అధికంగా సోకుతాయి. తెగుళ్ల సమస్య అధికంగా ఉంటుంది. అయితే తగు జాగ్రత్తలు తీసుకుని చీడపీడలను అధిగమించిన రైతులకు మాత్రం లాభాల పంట పండుతోంది. ఎకరాకు దాదాపు 5 టన్నుల నుంచి 7 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. మార్కెట్ దన్ను కూడా తోడు కావడంతో ఆదాయం కళ్లజూస్తున్నారు. ఖర్చులన్నీ పోను ఎకరాలకు రూ.60వేలకు పైగా ఆర్జిస్తున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి చాలా ప్రాంతాల్లో పొత్తులు వచ్చాక పైరు ఎండిపోవడం, వేరు పురుగుల బెడద వంటి సమస్యలతో పంట దెబ్బతింది. దీంతో స్వీట్‌కార్న్‌కు విపరీతంగా డిమాండ్ ఏర్పడినట్లు రైతులు వెల్లడిస్తున్నారు.

తూకం.. మోసం


గ్రామాల్లోని దుకాణాల్లో అవకతవకలకు చేసేందుకు తయారు చేసుకున్న కాటాలు


తూనికలు, కొలతలు ముద్రలు వేయకుండానే వినియోగిస్తున్న తూకం గుండ్లు

- తనిఖీలు మరిచిన అధికారులు
- నష్టపోతున్న వినియోగదారులు

గుడిపాల: ఎలక్ట్రానిక్ కాటాలు, కంప్యూటరైజ్డ్ తూనికలు తప్పనిసరిగా వినియోగించాలన్న నిబంధనలు ఉన్నా పలు దుకాణాల్లో తూనిక రాళ్లతో మోసం చేస్తున్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటికీ సంప్రదాయ కాటాలనే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాలను ఉపయోగించాలి. కానీ రాళ్లను కేజీ లెక్క చూపించి తూకాలు నిర్వహిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. తూనిక రాళ్లను ప్రతి రెండేళ్లకు ఓసారి తూనికలు, కొలతల విభాగం వారిచే సరిచేయించి ముద్ర వేయించుకోవాలి. ఇది మండలంలో ఎక్కడా జరగడం లేదు. అధికారులకు మామూళ్లు అందడమో లేక నిర్లక్ష్యమో తెలియదు కానీ నిబంధనలు మాత్రం అమలుకు నోచుకోలేదు. గ్రామాల్లో ఆయా సీజన్‌ల బట్టి దుకాణాల్లో వ్యాపారం జరుగుతుంది. అంతేగాకుండా కూరగాయలు, పండ్లు తదితర వ్యాపారాలు ద్విచక్ర వాహనాలు, రోడ్లకు ఇరుపక్కలా బండ్లపైన అధికంగా సాగుతోంది. అరిగిపోయిన రాళ్లను ఉపయోగించి వ్యాపారులు మోసానికి పాల్పడడంతో వినియోగదారులు నిత్యం నష్టపోతున్నారు. ఎలక్ట్రికల్ కాటాలతో సైతం వ్యాపారులు అక్రమాలకు తెరతీస్తున్నారు. ముందుగా వందగ్రాములు తగ్గించి జీరో వచ్చేలా అమర్చుతున్నారు. కొన్ని దుకాణాల్లో కాటాపై ఉన్న పళ్లెం బరువును లెక్కించకుండా తూకంలో కలిపేసి మోసాలకు పాల్పడుతున్నారు. కేజీకి 50గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు అధికశాతం దుకాణాల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. కొద్దిరోజుల కిందట తూనికలు, కొలతల శాఖాధికారులు మండలంలో నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకున్నారు. తనిఖీలు చేసిన ప్రతిచోటా వ్యత్యాసం ఉండడంతో ఏమీ చేయలేక మిన్నుకుండిపోయారు.

వంట గ్యాస్‌కు ఈకేవైసీ తప్పనిసరి

శాంతిపురం: వంట గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని రాళ్లబూదుగూరులోని ఎస్ఎల్‌వీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ అధినేత మంజునాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభు త్వ ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వినియోగదారులు శాంతిపురంలోని సేవాకేంద్రం లేదా రాళ్లబూదుగూరు రామేగానిపల్లె ఉన్న గ్యాస్‌ఏజెన్సీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. గ్యాస్‌బుక్ లేదా బుకింగ్ కార్డు, ఆధార్ కార్డుతో వినియోగదారులు రావాలని సూచించారు.

60 మంది కంటి రోగులకు పరీక్షలు


రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వారు నిర్వహించిన శిబిరాన్ని లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ ప్రారంభించారు. 60 మంది రోగులకు పరీక్షలు చేసి 20 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి రవాణా, భోజనం, కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు శివ తెలిపారు. గోపాలకృష్ణ, రఘుపతిరెడ్డి, వెంకటరమణారెడ్డి, రఘు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదం తొలగేలా మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

సదుం: మండలంలోని పుట్టావారిపల్లెలో ఇళ్ల ముందు చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఈ మేరకు ఆదివారం సాక్షి పత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహి వెంటనే మరమ్మతుల చేయాలని ఆదేశించారు. లైన్‌మన్ ధనశేఖర్ ఆధ్వర్యంలో విద్యుత్ వైర్లను చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

ఆలయ భూమి ఆక్రమణకు చెక్!


దేవాలయ స్థలంలో ప్రహరీ గోడ నిర్మిస్తున్న దృశ్యం

పుంగనూరు: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీభోగనంజుండేశ్వరాస్వామి ఆలయ భూమి ఆక్రమణకు దేవదాయశాఖ అధికారులు చెక్ పెట్టారు. ఆదివారం ఈ మేరకు కబ్జాకు గురైన స్థలంలో ప్రహరీగోడ నిర్మాణం చేపట్టారు. వివరాలు.. సుమారు రూ.కోటి విలువైన ఈ భూమిని స్వాహా చేసేందుకు కొందరు అక్రమార్కులు యత్నించారు. రికార్డులు సృష్టించి పురపాలక అనుమతులు సైతం పొందారు. దీనిపై దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ స్పందించి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కమిషనర్ నరసింహప్రసాద్ వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సర్వే చేశారు. కబ్జాదారులు రికార్డులు తారుమారు చేసి ప్లాను పొందినట్లు గుర్తించారు. వెంటనే సంబంధిత అనుమతులు రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఈ క్రమంలో దేవదాయశాఖ అధికారులు ఆలయ వద్దకు చేరుకుని ఆక్రమిత స్థలాన్ని మరెవరూ కబ్జా చేయకుండా ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ భూమిని పరిరక్షించడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం


జయరామప్ప దంపతులను సన్మానిస్తున్న ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు

గంగవరం: మండలంలోని కలగటూరు గ్రామానికి చెందిన జయరామప్ప పెద్దపంజాణి మండలం శంకరాయలపేట ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం పలమనేరు పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆయనను ఘనంగా సత్కరించారు. ఎస్టీయూ కమిటీ రాష్ట్ర నాయకుడు గంటా మోహన్ మాట్లాడుతూ జయరామప్ప రెండు దశాబ్దాలుగా ఎందరో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినట్టు వెల్లడించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, ఎస్టీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు మదన్‌మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పెద్దపంజాణి మండలాధ్యక్షుడు బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, డివిజనల్ కన్వీనర్ నారాయణస్వామి, ఎంఈఓలు గోపాల్‌రెడ్డి, తులసీరాం, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షాకాలం.. జరభద్రం!

ఐరాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా సోకుతుంటాయి. వాతావరణం మార్పుల కారణంగా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధి, పైలేరియా వ్యాధులు ప్రబలే అవకాశముంది. అలాగే నీటి కలుషితం వల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమ లార్వాలు వృద్ధి చెందకుండా పాత టైర్లలో, కూలర్లు, పాత టైర్లు, కుండలు, చిన్నచిన్న పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కాలువలు, గుంతల్లో దోమల నివారణ మందు చల్లాలి. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఆశా వర్కర్లు, సచివాలయ ఏఎన్ఎంలతో పాటు మండల వైద్యారోగ్య శాఖ అధికారులు, మలేరియా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

దోమ నివారణకు ప్రత్యేక చర్యలు

దోమల నివారణకు దోమ తెరలను వాడడం, ఇంటి కిటికీలు, తలుపులు, లెట్రిన్ ఔట్‌లెట్ పైపులకు మెష్ వేసుకోవాలి. ఇంట్లో సాయంత్రం పూట వేపాకు పొగ బెట్టాలి. శరీరం, చేతులు, కాళ్లు కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. కాచి వడపోసిన శుభ్రమైన నీరు తాగాలి. జంక్ తరహా ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంటి ఆహారాన్నే వేడివేడిగా తినాలి.పడుకునే సమయంలో దోమ తెరలు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఖరీఫ్ ప్రారంభమై మాసం దాటింది.. ఇప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మిగిలింది.. ఏటా సీజన్‌కు ముందే రూ.20వేలు అందిస్తామన్న చంద్రబాబు హామీ నీటి మీద రాతగా మారిపోయింది.. అధికారంలోకి వచ్చేందుకు ఉన్న శ్రద్ధ.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఉండదని మరోమారు రుజువవుతోంది.. సేద్యం పనులు మొదలెట్టేందుకు చేయూత కోసం రైతాంగం ఆశగా ఎదురుచూస్తూనే ఉంది.. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది.. అన్నదాతను సకాలంలో ఆదుకోకుండా కాలయాపన చేస్తోంది.. పథకం అమలుపై కనీసం స్పష్టత కూడా ఇవ్వకుండా అయోమయానికి గురి చేస్తోంది.

జీడీ నెల్లూరు మండలంలో ఓ రైతు అప్పు చేసి సాగు చేస్తున్న వరి పంట



సాగుకు అందని భరోసా

- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ చేసిన కేంద్రం
- ఏటా రూ.20వేలు అందిస్తామన్న హామీని అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- అన్నదాతల అవస్థలను ఖాతరు చేయని వైనం
- సేద్యం పనులకు సాయం కోసం ఎదురుచూస్తున్న రైతాంగం


వరి నాట్లకు పొలం సిద్ధం చేస్తున్న రైతులు

పాలసముద్రం : వ్యవసాయానికి అండగా నిలుస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద సకాలంలో పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించేది.

అయితే ఏటా రూ.20వేలు ఇస్తామని హామీలు గుప్పించిన చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు పూర్తయినా ఇప్పటికీ పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పష్టం ఇవ్వలేదు. కేవలం రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అని మార్చడం తప్ప చేసింది ఏమీ లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా.. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం కింద తొలి విడత నగదు రూ.2వేలను రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేసేసింది.

నాడు ఆరంభంలోనే..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసేది. పెట్టుబడికి అన్నదాతలు ఏమాత్రం ఇబ్బంది పడకూడదని చిత్తశుద్ధితో సాయం అందించేది. పీఎం కిసాన్ కింద రూ.6వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతలు అన్నదాతల ఖాతాల్లో సీజన్ ఆరంభంలోనే జమ చేసేది. ఒక్క గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోనే సుమారు 43,480 మంది రైతులకు ఏడాదికి రూ.51.69 కోట్లు పంపిణీ చేసేది.

పంట రుణాలకు పాట్లు!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. దీంతో సేద్యం పనుల కోసం రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం మార్చడంలో చూపిన తొందరలో రాష్ట్ర ప్రభుత్వం సగమైనా రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో చూపించి ఉంటే సాగు సంబరంగా ఉండేది.

అన్నదాతకు అప్పులే గతి..!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా పథకం నిధులను అన్నదాతలకు అందించేది. ఈ ఏడాది కూడా మేలోనే రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన పీఎం కిసాన్ నగదు రైతులకు దుక్కులకు ఉపయోగపడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు వాడుకోవాల్సి ఉంటుంది. కానీ, కూటమి సర్కారు స్పందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

“

ఇబ్బంది లేకుండా చూడాలి



నాకు మూడు ఎకరాల భూమి ఉంది. మొదట వేరుశనగ సాగు చేశాం. విత్తనాలు మొలకెత్తకపోవడంతో మళ్లీ వరి, చెరుకు వేసుకున్నాం. సాగు ఖర్చులు పెరిగాయి. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఉచిత పంట బీమాను అమలు చేసేది. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రైతులకు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– రవిరెడ్డి, రైతు, కృష్ణజమ్మపురం

అప్పు చేయాల్సి వచ్చింది



నాకు ఎకరా భూమి ఉంది. పంటల సాగుకు పెట్టుబడిగా రూ.15వేలు అవసరం. గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల కింద ఒకేసారి డబ్బులు ఇచ్చేవారు. దాంతో పెట్టుబడికి వెతుక్కోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అప్పు చేసి పంట సాగు ప్రారంభిస్తున్నాం. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని ఈసారైనా చంద్రబాబు నిలబెట్టుకుంటే బాగుంటుంది. సకాలంలో ఇస్తేనే మాకు మంచి జరుగుతుంది.

– శేఖర్‌రాజు, రైతు, తొట్టికంద్రిగ